క్లుప్తంగా

పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ ప్రారంభం

నిడదవోలు: రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణను ప్రారంభించినట్టు స్థానిక సబ్ ట్రెజరీ అధికారి జి.అప్పారావు తెలిపారు. సబ్ ట్రెజరీ కార్యాలయంలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నిడదవోలు శాఖ అధ్యక్షుడు బలగం అప్పారావు ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నిడదవోలు సబ్ ట్రెజరీ ద్వారా పెన్షన్ తీసుకొనే ప్రభుత్వ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఫిబ్రవరి నెలాఖరులోగా సమర్పించాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి కీర్తి ఆంజనేయులు, ఎలిపిన శేషగిరిరావు, బొజ్జా పాపారావు, ఖండవిల్లి రంగాచార్యులు, పొన్నా సుబ్రహ్మణ్యం, ఎస్ఎం షరీఫ్, సమంతకమణి, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రగ్గుల పంపిణీ



దివ్యాంగులకు రగ్గులు అందజేస్తున్న శ్రీకాకోళపు కాళీకృష్ణ

దేవరపల్లి: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని గొల్లగూడెం వద్ద గల లగడపాటి రామానాయుడు, రామలక్ష్మమ్మ దివ్యాగుల ఆశ్రమంలోని 50 మంది దివ్యాంగులకు స్థానిక పొట్టి శ్రీరాములు పర్యరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి శ్రీకాకోళపు కాళీకృష్ణ ఉచితంగా రగ్గుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాళీకృష్ణ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా దివ్యాంగులకు స్వీట్లు, రగ్గులు పంపిణీ చేశామన్నారు. తాను నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు అనేక అవార్డులు అందుకున్నట్టు చెప్పారు. ఇటీవల చెన్నై యూనివర్సిటీ తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్టు ఆయన చెప్పారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం



అన్నదేవరపేటలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న వేద పండితులు

తాళ్లపూడి: అన్నదేవరపేట బీసీ కాలనీలో కొత్తగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు మొదలయ్యాయి. పెనుగొండకు చెందిన ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు, ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో మహా సంకల్పం, హోమాలు, యాగశాల ప్రవేశం వంటి క్రతువులు నిర్వహించారు. దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ వేడుకకు విచ్చేసిన పండితులకు ఆలయ కమిటీ, అర్చకుడు రంగాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. పలువురు దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ పూజలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

కొవ్వూరు: స్థానిక మినీ బైపాస్ రోడ్డులోని ప్రైవేట్ స్కూల్ సమీపంలో పేకాడుతున్న ఆరుగురిని ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,370 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

శ్రీరాముని అక్షతలతో ఇంటింటి ప్రచారం



గోపాలపురంలో అక్షతల పంపిణీ

పెరవలి: అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామ మందిరం ఈ నెల 22న ప్రారంభం అవుతున్న నేపథ్యంలో దేశంలోని ప్రతి ఇంటికి అక్షతలు, రామ మందిర ఆహ్వాన పత్రికలు పంపిణీ చేస్తున్నామని విశ్వహిందూ పరిషత్ సభ్యుడు తుట్టగుంట అచ్యుతరామయ్య తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం అక్షింతలు, రామ మందిర ఆహ్వాన పత్రికలు, కలశంతో ఖండవల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తారని, ఆరోజు సాయంత్రం ప్రతి ఇంటి వద్ద దీపాలు వెలిగించాలని కోరారు.

దేవరపల్లి: అయోధ్య రాముని అక్షతలను మహిళలు త్యాజంపూడిలో ఇంటింటికీ పంపిణీ చేశారు. అయోధ్య నుంచి ఈ అక్షతల ను తీసుకువచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని సుమారు 3000 ఇళ్లకు పంపిణీ చేశారు. హిందూ ధర్మపరిషత్ ఆధ్వర్యంలో గ్రా మంలోని భజన సమాజం వారు అక్షతలను పంపిణీ చేశారు. గ్రామస్తులు కోలాట నృత్య ప్రదర్శనలతో ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు.

గోపాలపురం: అయోధ్య శ్రీరామచంద్రుని అక్షతలను గోపాలపురంలో ఇంటింటికీ వెళ్లి మేళతాళాలతో భక్తులకు అందజేశారు. జైశ్రీరామ్ నినాదాలతో భక్త బృందం సభ్యులు గెల్లా శ్రీనుబాబు, వుండవల్లి మార్కండేయులు, వేములపల్లి నరేంద్ర, వింత అమర ప్రసాద్‌రెడ్డి గ్రామంలో ఇంటింటికీ తిరిగి భక్తులకు అక్షతలు అందజేశారు.



కొవ్వూరులో కేక్ కట్ చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత



నిడదవోలులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు



దేవరపల్లిలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

అంబరాన్ని అంటేలా సంబరాలు

- ఎక్కడ చూసినా న్యూ ఇయర్ వేడుకలు
- కొవ్వూరులో మంత్రి వనిత, నిడదవోలు, దేవరపల్లిలలో ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌నాయుడు, తలారి వెంకట్రావు కేక్ కటింగ్
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులు

కొవ్వూరు: నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వివిధ వర్గాల వారు వేడుకలు జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ కొవ్వూరులోని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యుల మధ్య మంత్రి వనిత కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. సోమవారం ఉదయం మంత్రి వనిత తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు ఆశీస్సులు తీసుకుని భారీ కేక్ కట్ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వచ్చి మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ ఉప్పులూరి విజయలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, డ్వామా పీడీ పి.జగదాంబ, ఐసీడీఎస్ జిల్లా అధికారి కె.విజయకుమారి తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

నిడదవోలు: స్థానిక శాంతినగర్‌లోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆ పార్టీ శ్రేణులు, ప్రభుత్వ శాఖల అధికారులు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు అయినీడి పల్లారావు, వీరమళ్ల సత్యనారాయణ, ఎంపీపీలు కార్చెర్ల ప్రసాద్, భాగ్యలక్ష్మి, పాలాటి యల్లారేశ్వరి, పార్టీపట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీలు కొయ్యే సూరిబాబు, నందిగం భాస్కరరరామయ్య, కొమ్మిశెట్టి రామాంజని, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, అభిమానులు, కుటుంబ సభ్యుల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే వెంకట్రావుకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, నరహరిశెట్టి రాజేంద్రబాబు పార్టీ మండలశాఖ అధ్యక్షులు కూచిపూడి సతీష్, తహసీల్దార్ కార్యాలయంలో తహల్దార్ తహసీల్దార్ ఎం. రామకృష్ణ నూతన సంవత్సర కేక్ కట్ చేశారు.

నిడదవోలు రూరల్: మండలంలోని ప్రతి ఇంటి ముంగిటా నూతన సంవత్సరానికి రంగవల్లులతో స్వాగతం పలికారు. స్నేహితులు, బంధువులు, ప్రేమికులు గ్రీటింగ్ వాట్సప్, ఫేస్‌బుక్, ఎస్ఎంఎస్‌లు, పూలబొకేలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నిడదవోలులో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన న్యూ ఇయర్ వేడుకలకు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది భారీగా తరలి వెళ్లారు. పలు క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో నూతన సంవత్సర ఆరాధనలు నిర్వహించి ప్రేమవిందు స్వీకరించారు.

నల్లజర్ల: ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రజలు నూతన సంవత్సర వేడుకలు మొదలయ్యాయి. వివిధ వర్గాల వారు భారీ ఎత్తున బాణసంచా కాల్చి, కేక్‌లు కట్ చేశారు. నల్లజర్లలో సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్‌కు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతపల్లిలో ఎంపీపీ బంక జయలక్ష్మిని ఆమె ఇంటి వద్ద అధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, నాయకులు, ప్రజాప్రతినిధులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉండ్రాజవరం: జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావును ఉండ్రాజవరంలోని ఆయన నివాసంలో అధికారులు, పార్టీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, నందిగం సీతారామయ్యలకు మండల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. పాలంగిలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పెరవలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్‌కు అధికారులు, వైఎస్సార్ సీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కలసి పుష్పగుచ్ఛాలు, పండ్లు అందించి కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, పలు పంచాయతీల సర్పంచులు, కొమ్మి శెట్టి రాము, తోట సురేష్, అంబటి బ్రహ్మయ్య, మధు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ఎంపీపీ జొన్నకూటి పోశిరాజుని తాళ్లపూడిలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పూల బొకేలు, పండ్లు అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖకు కూడా పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చాగల్లు: హ్యాపీ న్యూ ఇయర్ అంటూ యువత కేరింతలు కొట్టారు. పలువురు ఇళ్లు, వ్యాపారాలు, సంస్థల ముంగిట నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగవల్లులు తీర్చిదిద్దారు. క్రైస్తవ దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. బ్రాహ్మణగూడెంలో పెంతుకోస్తు, బైబిల్ మిషన్, చాగల్లులో జీడీఎం, నెలటూరులో ఊనగట్ల క్రైస్తవ దేవాలయాల్లో విశ్వాసులు కొవ్వొత్తులు వెలిగించి, కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. చాలా మంది పూల బొకేలను కొనుగోలు చేసి శ్రేయోభిలాషులకు హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు తదితరులు కేక్ కట్ చేసి నూతన శుభాకాంక్షలు తెలిపారు.

పేదోడి ఇంట పింఛన్ల పండగ



దేవరపల్లిలో ఇంటింటికీ వెళ్లి పెంచిన పింఛన్ అందజేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



నిడదవోలులో పెంచిన కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, చిత్రంలో పలువురు లబ్ధిదారులు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- రూ.3,000 కు పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీ

దేవరపల్లి: పేదోడి ఇంట పింఛన్ల పండుగ వాతావరం నెలకొందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పెరిగిన సామాజిక పింఛన్ల పంపిణీకి సోమవారం దేవరపల్లిలో శ్రీకారం చుట్టారు. ఈ నెల నుంచి పెరిగిన రూ.3000 పింఛను సొమ్మును ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వృద్ధాప్య, వితంతు, ఒంటరి, దివ్యాగులకు జనవరి నుంచి రూ.3,000 చొప్పున పింఛను అందజేస్తున్నామన్నారు. దేవరపల్లి మండలంలో 11,836 మందికి రూ. 3 వేల చొప్పున పింఛను అందుతుందన్నారు. కొత్తగా 236 మందికి పింఛన్లు మంజూరైనట్టు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరొకసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, నరహరిశెట్టి రాజేంద్రబాబు, కూచిపూడి సతీష్, గారపాటి రమాప్రభ, కవల శ్రీనివాస్, కామిశెట్టి దుర్గారావు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

నిడదవోలు: స్థానిక శాంతినగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు రూ.3 వేలకు పెంచిన ఫించన్లను సోమవారం 81 మంది లబ్ధిదారులకు నూతన సంవత్సర కానుకగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ యలగడ బాలరాజు, కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, అహ్మదున్నీసాబేగం, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వరం గ్రామంలో పెంచిన పెన్షన్ నగదును నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధి తిక్కా శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు. పురుషోత్తపల్లిలో సర్పంచ్ నేలపూడి నాగమణి, ఉప సర్పంచ్ కొండేపాటి సూర్యనారాయణ, నాయకులు మునుకోటి చిన్ని, గొల్లకోటి పోశియ్య, కార్యదర్శి ఎల్.రవికుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

8 వరకూ సచివాలయాల వద్ద పంపిణీ

విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: పండగ వాతావరణంలో గ్రామాల్లో వైఎస్సార్ పింఛను కానుకలను అందజేయాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులను కోరారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల నుంచి అవ్వాతాతలకు పింఛన్ రూ.3 వేలకు పెంచి ఇస్తున్నట్టు తెలిపారు. గ్రామ సచివాలయాల వద్ద ఈ నెల 8వ తేదీ వరకూ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు సమక్షంలో పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ నెల 17 నుంచి 23 వరకూ డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత నిధులను విడుదల చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం వారం రోజులు పండగ వాతావరణంలో జరుగుతుందన్నారు. 23న నల్లజర్లలో వైఎస్సార్ ఆసరా పథకం నాల్గవ విడత సొమ్ము మహిళ ఖాతాలకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జమ చేయనున్నారని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత సురక్ష వైద్య శిబిరాలు

డీఎల్‌డీవో శాంతమణి వెల్లడి



శాంతమణి డీఎల్‌డీవో,కొవ్వూరు

కొవ్వూరు: ఈ నెల రెండో తేదీ నుంచి నెలాఖరు వరకూ కొవ్వూరు డివిజన్‌లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్టు డీఎల్‌డీవో వి.శాంతమణి తెలిపారు. సోమవారం ఆమె కొవ్వూరులో విలేకరులతో మాట్లాడారు. 2న తాళ్లపూడి మండలం మలకపల్లి పీహెచ్‌సీ పరిధిలోని బల్లిపాడు, దేవరపల్లి మండలం గౌరీపట్నం పీహెచ్‌సీ పరిధిలోని గౌరీపట్నంలోను, కొవ్వూరు మండలం మార్కొండపాడు పీహెచ్‌సీ పరిధిలోని మద్దూరులోను, నిడదవోలు మండలం సమిశ్రగూడెం పీహెచ్‌సీ పరిధిలోని సింగవరంలోను, ఉండ్రాజవరం పీహెచ్‌సీ పరిధిలోని చివటం గ్రామంలోను వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3న కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలోని క్రిస్టియన్ పేట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని సచివాలయంలోను, నిడదవోలు నెహ్రూ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లోను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 5న గోపాలపురం పీహెచ్‌సీ పరిధిలోని వేళ్లచింతల గూడెంలోను, నల్లజర్ల మండలంలోని దూబచర్లలోను, చాగల్లు మండలం నందిగంపాడులోను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. 9న రాజం పాలెం, దొమ్మేరు-2లోను, మల్లవరం-1లోను, కోరుమామిడి-1, ఉండ్రాజవరం-2 సచివాలయాల పరిధిలోను శిబిరాలు కొనసాగుతాయన్నారు. 10, 17, 24, 31తేదీల్లో కొవ్వూరు క్రిస్టియన్ పేట, నిడదవోలు నెహ్రూ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ల పరిధిలోను, 12న వేగేశ్వరపురం-2, అన్నదేవర పేట-1 లోను, దేవరపల్లి-2లోను ,19న ప్రక్కిలంక, జగన్నాథపురంలోను, దుమంతునిగూడెంలోను, ధర్మవరం, బ్రాహ్మణగూడెం-1, సమిశ్రగూడెం-2, పసలపూడి సచివాలయాల పరిధిలోను నిర్వహిస్తారు. 23న గోపాలపురం-1, అనంతపల్లి-2, కుమారదేవం-1 లోను, చాగల్లు-2, తాడిమళ్ల-2, ఉండ్రాజవరం-1, ఖండపల్లి-3 సచివాలయ పరిధిలోను,27న తాళ్లపూడి-1 లోను, చిన్నాయిగూడెం-2 లోను,30న పెద్దేవం-1లోను, కరగపాడు, నందమూరు,ఉనగట్ల సచివాలయ పరిధిలోను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్యాలయ భవనం కారుతోంది

- శిథిలావస్థలో మండల పరిషత్ ఆఫీసు భవనం
- కొత్త భవనం నిర్మించాలని వినతి



బీటలు వారిన నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయ భవనం

నల్లజర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. గోడలు బీటలు వారాయి. పైకప్పు రేకులు పగిలిపోయి వర్షం కురిస్తే నీరు గదుల్లోకి చేరుతోంది. ఉద్యోగులు కూర్చోవడానికి సైతం వీల్లేని పరిస్థితి ఏర్పడుతోంది. ఏ క్షణంలో భవనం పైకప్పు కూలుతుందో అంటూ ఉద్యోగులు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. స్వర్గీయ అల్లూరి కృష్ణారావు నల్లజర్ల సమితి అధ్యక్షుడిగా ఉండగా ఈ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. 1064, జనవరి 15న అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ నీలం సంజీవరెడ్డి ఈ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అప్పట్లో ఈ భవనం చుట్టూ ఉద్యోగుల క్వార్టర్లు కూడా ఉండేవి. సమితులు రద్దయ్యాక మండలాలు వచ్చాయి. ఈ భవనంలోనే నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. భవనం నిర్మించి, ఇప్పటికి దాదాపు 60 ఏళ్లు పూర్తయ్యాయి. కనీసం ఒక్కసారి కూడా మరమ్మతులు చేపట్టక పోవడంతో భవనం దాదాపు శిథిలావస్థకు చేరింది. ఈ భవనంలోనే మండల పరిషత్ కార్యాలయంతో పాటు గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ విభాగాలు, ఈఓపీఆర్డీ కార్యాలయాలు ఉన్నాయి. అంతేగాకుండా ఈ ప్రాంగణంలో ఉపాధిహామీ, వైఎస్సార్ క్రాంతి పథం, ఎంఈఓ, గృహ నిర్మాణశాఖ డీఈ, వ్యవసాయ, రెవెన్యూ శాఖల కార్యాలయాలు, పీహెచ్‌సీ ఉన్నాయి.

ఎంపీపీ వివరణ

దీనిపై ఎంపీపీ బంక జయలక్ష్మి స్పందిస్తూ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించామని చెప్పారు. అంతేకాకుండా ఎంపీ మార్గాని భరత్‌రామ్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్ళామన్నారు. ఇంత వరకూ నిధులు మంజూరు కాలేదన్నారు. ముఖ్యమంత్రి తక్షణం స్పందించి నూతన భవన నిర్మాణానికి రూ.2 కోట్లు విడుదల చేయాలని ఆమె కోరారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



గోపాలపురంలో కార్మికులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న మానవత సంస్థ నాయకులు

గోపాలపురం: గోపాలపురం పంచాయతీలో పని చేసే 20 మంది పారిశుధ్య కార్మికులకు సోమవారం ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులైన చిన ఏసురెడ్డి, బుజ్జానికమ్మల జ్ఞాపకార్థం మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు ముప్పన కృపావరప్రసాద్‌రెడ్డి ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గోపాలపురం సొసైటీ చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పోతుల అప్పిరెడ్డి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి , మానవత సంస్థ మాజీ అధ్యక్షుడు నెల్లి చంద్రశేఖర్, ముద్దన మురళీకృష్ణ, వింత ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వి.రాఘవరెడ్డి పాల్గొన్నారు. కాగా గోపాలపురం పంచాయతీ పరిధిలోని పెద్దగూడెంలో ఇటీవల అనారోగ్యానికి గురైన వృద్ధురాలు కడిమి బుచ్చమ్మకు మానవత సంస్థ సభ్యుడు మద్దిపాటి గంగరాజు రూ.రెండు వేల ఆర్థిక సహాయం చేశారు.

పాలంగి తేగ.. టేస్ట్ భలేగా



పాలంగిలో తేగలను శుభ్రం చేస్తున్న అమ్మకందారుడు

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి ప్రాంతంలో తయారైన తేగలకు నిడదవోలు, తణుకు నియోజకవర్గాల్లో చెప్పలేనంత డిమాండ్ ప్రస్తుతం తేగల సీజన్ కావడంతో ఈ గ్రామంలో తయారైన తేగలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడుతున్నారు. పాలంగి ప్రాంతంలోని తేగలు బాగా ఊరతాయి. అదీగాక ఇక్కడి మట్టి మహిమో, మరేమో గాని వాటి రుచి అమోఘం. ఏటా సెప్టెంబర్ నుంచి జనవరి వరకూ పాలంగి ప్రాంతంలో తేగల విక్రయాలు జోరుగా సాగుతాయి. పెద్ద సైజు తేగల కట్ట (సుమారు 10 తేగలు) రూ.100, చిన్న సైజు తేగల కట్ట రూ.50, మరీ చిన్నతేగల కట్ట రూ.20 రేటుకు వ్యాపారులు అమ్ముతున్నారు. తేగల ధర అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండడంతో ఎక్కువ మంది వాటిని కొనుగోలు చేసి ఇష్టంగా తింటున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో సుమారు 100 కుటుంబాలు ఏటా ఈ సీజన్‌లో తేగల విక్రయాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. పూర్వం రైతులు పొలంలో తేగల పాతర వేసి, ఊరాక తవ్వి తీసి, కాల్చి వాటిని ఇంటికి తీసుకు వచ్చేవారు. దాంతో ఇంట్లో వారంతా రెండు, మూడు రోజుల పాటు వాటిని తినేవారు. ప్రస్తుతం చాలామంది రైతులు పొలాల్లోని తాటి చెట్లను తొలగించారు. అదీగాక తేగల పాతర వేయడానికి రైతులు, కౌలుదారులు ఇప్పుడు అనాసక్తి చూపుతున్నారు. దాంతో ఒకప్పుడు ఉచితంగా లభించే తేగలను ఇప్పుడు డబ్బు పెట్టి కొనుక్కోవలసిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

టెన్త్ ఉత్తీర్ణత శాతం పెంపునకు మోడల్ టెస్ట్ పేపర్లు

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మనోహరకుమార్

నల్లజర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిష్ణాతులైన సబ్జెక్టు టీచర్లతో మోడల్ టెస్ట్ పేపర్లు తయారు చేయించి విద్యార్థులకు అందిస్తున్నట్టు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్ మనోహరకుమార్ తెలిపారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదే మాదిరిగా గతేడాది తయారు చేయించిన మోడల్ టెస్ట్ పేపర్ల సాయంతో శిక్షణ పొందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న యాప్‌ల వల్ల ఇబ్బందికర పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని, వాటిని మార్పు చేయాలని మనోహర్‌కుమార్ కోరారు. సీపీఎస్ రద్దు, ఆర్థిక పరమైన అంశాలపై ప్రభుత్వం తక్షణం నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ మండల శాఖ గౌరవాధ్యక్షుడు పి.వెంకట అప్పారావు, ప్రధాన కార్యదర్శి బండి కిశోర్, కార్యదర్శులు ఎల్.నాగరాజు, టి.మరియదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com